సాక్షి
వికారాబాద్

గురువారం । 10 । అక్టోబర్ । 2024



కల నెరవేరిన వేళ

డీఎస్సీలో సత్తాచాటిన అభ్యర్థులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. 10లో▸



సైబర్ నేరాలపై..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ ఇన్‌చార్జి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 10లో▸



సమస్యలు పరిష్కరించండి

సిమెంట్ రవాణాలో నెలకొన్న సమస్యలను తీర్చాలని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారు గోపాల్ కోరారు. 10లో▸

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నేతలు

కొడంగల్: ఫార్మా బాధిత రైతుల పక్షాన బుధవారం దుద్యాలలో నిర్వహించనున్న పాదయాత్రకు వెళ్లకుండా పట్టణానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కొంతకాలంగా బాధితుల కోసం ఆందోళన చేస్తున్నారు. దుద్యాల మండంలోని పోలేపల్లి, హకీంపేట, లగచర్ల గ్రామాల్లో ఫార్మా సిటీ నిర్మించడానికి ప్రభుత్వం భూములు సేకరిస్తున్న విషయం తెలిసిందే. దీన్ని నిరసిస్తూ నరేందర్‌రెడ్డి పాదయాత్రకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో కొడంగల్‌లో రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బాకారం అరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుల్జారాం గౌడ్

మోమిన్‌పేట: వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుల్జారాం గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీపీఎఫ్, పీఆర్సీ బకాయిలు, మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బెనిఫిట్స్‌కు సంబంధించని బిల్లులను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ట్రెజరీలో బిల్లులు ఆమోదం పొందినా ఉద్యోగుల ఖాతాల్లో జమ కావడం లేదని పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు లేవని, వెంటనే మంజూరు చేయాలన్నారు. దసరా, దీపావళి పండుగలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.

ఇన్‌చార్జ్ ఈఈగా ఉమేష్‌కుమార్

తాండూరు రూరల్: పంచాయతీరాజ్ తాండూరు డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈగా ఉమేష్‌కుమార్‌ను నియమించారు. బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఈఈ సత్యానారాయణరెడ్డి సెలవుపై వెళ్లడంతో వికారాబాద్ ఈఈ ఉమేష్‌కుమార్‌కు తాండూరు బాధ్యతలు అప్పగించారు.

అసంక్రమిత వ్యాధులపై జాగ్రత్త

డీఎంహెచ్‌ఓ పాల్వాన్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పాల్వాన్‌కుమార్

అనంతగిరి: అసంక్రమిత వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డీఎంహెచ్‌ఓ పాల్వాన్‌కుమార్ వైద్యాధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వికారాబాద్‌లోని ఆయన కార్యాలయంలో రక్తపోటు, గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడి చికిత్స పొందుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. దీర్ఘకాలంలో ఈ వ్యాధుల వల్ల అధిక నష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి నిరోషా, డీఈఎంఓ శ్రీనివాసులు, కోఆర్డినేటర్లు రేణుకుమార్, జయరాం, పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం?

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో అవకతవకలు

- ఎస్జీటీ, పీఈటీ అభ్యర్థుల ఎంపికలో లోపాలు
- ఆర్‌సీఐ సర్టిఫికెట్ వ్యాలిడిటీ లేకున్నా ఎంపిక
- పీడీ పోస్టుల నియామకంలోనూ తప్పిదాలు
- విద్యాశాఖ కమిషనర్, కలెక్టర్‌ను కలిసిన బాధితులు
- డీఈఓను కలవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచన



వికారాబాద్: డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ గందరగోళంగా మారింది. అర్హులను కాదని అనర్హులను ఎంపిక చేయడంతో బాధిత అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా వ్యాయామ ఉపాధ్యాయులు(పీడీలు), స్పెషల్ ఎడ్యుకేషన్(ఎస్జీటీ) అభ్యర్థుల ఎంపికలో అక్రమాలు జరిగాయంటూ పలువురు బాధితులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ మంగళవారం విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డీఈఓను కలిసినా పెద్దగా స్పందన లేకపోవడంతో బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్.. డీఈఓతో ఫోన్‌లో మాట్లాడి వివరణ కోరడంతోపాటు తనను నేరుగా కలిసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అయితే సీఎం జిల్లాలోనే ఇలాంటి అవకతవకలు జరిగినా అధికారులు సరిగ్గా స్పందించకపోవడం దారుణమని బాధిత అభ్యర్థులు వాపోయారు.

పీడీ, ఎస్జీటీ పోస్టుల్లో..

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో జరిగిన అక్రమాల కారణంగా ఎస్జీటీ కేటగిరిలో నలుగురు, వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపికలో ముగ్గురికి అన్యాయం జరిగిందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనర్హులైన ఏడుగురిని ఎంపిక చేశారని వివరించారు. ఎమ్మార్(మెంటల్లీ రిటార్డెడ్) విద్యార్థులకు బోధించాలంటే ఆ సబ్జెక్టు స్పెషల్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ పూర్తి చేసి ఉండాలి. దాంతో పాటు ఆర్‌సీఐ (రీ హ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఉండియా) సర్టిఫికెట్ వ్యాలిడిటీ కలిగి ఉండాలి. అయితే మొదటి సారి ఈ డీఎస్సీలో స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 20 పోస్టులు భర్తీ చేశారు. ఇందులో నలుగురు అభ్యర్థులను ఆర్‌సీఐ సర్టిఫికెట్ వ్యాలిడిటీ లేకపోయినా ఎంపిక చేశారని బాధితులు ఆరోపించారు. ఇందుతో కొందరు సర్టిఫికెట్ వెరిఫికేషన్ రోజు(5వ తేదీ) వ్యాలిడిటీ సర్టిఫికెట్ పొందినట్లుగా ఫేక్ పత్రం సృష్టించి అందజేశారని తెలిపారు. ఆర్‌సీఐ వ్యాలిడిటీ లేని వివరాలను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని కలెక్టర్‌కు అందజేశారు. వీటితో పాటు పీడీ పోస్టుల ఎంపికలోనూ అవకతవకలు జరిగాయని బాధితులు ఫిర్యాదు చేశారు. మూడు పీడీ పోస్టులు ఉండగా వన్ ఈస్టు త్రీ చొప్పున తొమ్మిది మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసి ముగ్గురిని సెలక్ట్ చేశారు. అయితే ఎంపికైన వారిలో ఎవరూ వన్ ఈస్టు త్రీ జాబితాలో లేరని పేర్కొన్నారు.

అవగాహన లేకపోవడమేనా..

డీఎస్సీ అభ్యర్థుల ఎంపిక కోసం వన్ ఈస్టు త్రీ చొప్పున సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం అభ్యర్థులను పిలిచిన విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు సర్టిఫికెట్లను పరిశీలించిన అధికారులు మంగళవారం రాత్రి 9గంటల తరువాత ఎంపికైన అభ్యర్థులకు ఫోన్ మెసేజ్‌ల ద్వారా సమాచారం ఇచ్చారు. తుది జాబితాను ప్రకటించారు. అయితే కొన్ని క్యాటగిరిల్లో ఎంపిక విధానం.. వారికి ఉండే సర్టిఫికెట్లు, వాటి వ్యాలిడిటీ తదితర అంశాలపై వెరిఫికేషన్ చేసే అధికారులకు అవగాహన లేకపోవటంతో పొరపాట్లు జరిగినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కొందరు అభ్యర్థులు లోపాయికారిగా వ్యవహరించినట్లు సమాచారం. మార్కులు ఎక్కువగా వచ్చి మొదటి వరుసలో ఉన్న వారు అప్పటికే వేరే ఉద్యోగాలకు ఎంపికైన వారు.. ఇష్టం లేని వారు కొందరు వారి తరువాత స్థానాల్లో ఉన్న వారితో డబ్బులు మాట్లాడుకొని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రాలేదని తెలిసింది. దీంతో జాబితాలో తదుపరి వారికి లబ్ధి చేకూరేలా చేశారని కొందరు పేర్కొంటున్నారు.



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి న్యాయం చేయాలని కోరుతున్న డీఎస్సీ బాధితులు

ముహూర్తం ఖరారు



పాత కొడంగల్ సమీపంలో గురుకులాలకు కేటాయించిన భూమి

- రేపు సమీకృత గురుకులానికి భూమి పూజ
- ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు
- రూ.100 కోట్లతో భవన నిర్మాణం

కొడంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకులాల నిర్మాణానికి ఈ నెల 11న భూమి పూజ చేయనున్నారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు నిర్మించనున్నారు. ఇందుకోసం మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామ శివారులో 20 ఎకరాల భూమిని కేటాయించారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధన, ఉచితంగా వసతి కల్పించనున్నారు. అన్ని వసతులతో కూడిన నూతన భవన నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిసింది.

రాష్ట్ర వ్యాప్తంగా..

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 19 నియోజకవర్గాల్లో నూతన భవనాలను నిర్మించనున్నారు. ఇందు కోసం రూ.5 వేల కోట్లు కేటాయించారు. ఏడాదిలోపు పనులు పూర్తి చేసి గురుకులాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకే కాకుండా బోధన, బోధనేతర సిబ్బందికి అక్కడే నివాస గృహాలు నిర్మించనున్నారు. కొడంగల్, మధిర, మంథని, హుస్నాబాద్, నల్లగొండ, హుజూర్‌నగర్, ములుగు, ఖమ్మం, కొల్లాపూర్, చంద్రాయణగుట్ట, మంచిర్యాల, అచ్చంపేట, తిరుమలగిరి, పాలేరు, వరంగల్, ఆందోల్, భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తారని అధికారిక వర్గాలు తెలిపాయి.

కొడంగల్‌లో..

ప్రభుత్వ విద్యను పేదలకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు సమీకృత గురుకుల విద్యా సంస్థలను మంజూరు చేశారు. పాత కొడంగల్ వద్ద భవన నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం ఇక్కడ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల కొనసాగుతోంది. సుమారు ఐదు వందల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను నిర్మించనున్నారు. అధునాతన వసతులతో కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కావడంతో విద్య, వైద్య రంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.

వర్గీకరణ చేయకుండా నియామకాలా?

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణ చేయకుండా డీఎస్సీ నియామకాలు చేపట్టడంతో తమకు ఎంతో అన్యాయం జరిగిందని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతూ బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన అరగంటలోనే సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణ చేసి ఉద్యోగ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కానీ డీఎస్సీ నియామకాల్లో అమలు చేయలేదని, దీంతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. సీఎం తీరును యావత్ మాదిగ సమాజం తప్పు పడుతోందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, లేకుంటే ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు స్వామిదాసు, సుభాష్, నర్సింలు, కృష్ణ, మహేందర్, ఆనంద్, రవికుమార్, పుష్ప, కిష్టయ్య, అంజి, సూర్యప్రకాష్, పవన్, రాము తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

అధిక పిలకల పంట పరిశీలన

మోమిన్‌పేట: మండలంలోని ఎన్కేపల్లి రైతు నర్సింలు సాగు చేసిన మొక్కజొన్న పంటకు అధిక పిలకలు రావడంతో బుధవారం జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి పరిశీలించారు. సెప్టెంబరు 30న సాక్షి దిన పత్రికలో అధిక పిలకలతో నష్టం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన సందర్శించి పంటను పరిశీలించారు. ఒకటి లేదా రెండు పిలకలు వస్తే గింజలు అధికంగా పట్టి దిగుబడి పెరుగుతుందన్నారు. చిన్న చిన్న ఐదారు పిలకలు రావడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. శాస్త్రవేత్తలతో కలిసి పంటను పరిశీలిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏఈఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఎన్కేపల్లిలో అధిక పిలకల మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ మోహన్‌రెడ్డి తదితరులు



గోశాలను ప్రారంభించి ఆవుకు పూలమాల వేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గో సంరక్షణ అందరి బాధ్యత

- గోమాతను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కుల్కచర్ల: గో సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఘణపూర్ శివాలయం వద్ద గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని కోరారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. గోశాల ఏర్పాటుకు కృషి చేసిన ఘణపురం వెంకటయ్య, రాఘవేందర్ గౌడ్‌ను అభినందించారు. గోమాతను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని అన్నారు. గ్రామంలోని శివాలయం అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళంగా అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్, బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్, ప్రధాన కార్యదర్శి జానకీరాం చౌహాన్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి, పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్, బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్లేసిన పాపానికి అనుభవిస్తున్నాం

- ఫార్మా భూ బాధితుల ఆవేదన
- బీఆర్‌ఎస్ మహా పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు
- తుంకిమెట్ల వద్ద నేతల అరెస్ట్.. పరిగి ఠాణాకు తరలింపు
- రైతులతో మాట్లాడిన నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్



రైతులతో మాట్లాడుతున్న నారాయణపేట్ ఎస్పీ యోగేశ్ గౌతమ్

దుద్యాల్: మండలంలో ఫార్మా కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా బుధవారం పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి దుద్యాల్ వరకు బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు చేపట్టిన మహా పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. పాదయాత్రలో పాల్గొనేందుకు వస్తున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను బొంరాస్‌పేట మండలం తుంకిమెట్ల వద్ద పోలీసులు అరెస్ట్ చేసి పరిగి ఠాణాకు తరలించారు. నేతల అరెస్టుతో ఆగ్రహానికి గురైన నాయకులు, రైతులు హకీంపేట ప్రధాన కూడలిలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పచ్చటి గ్రామాల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేసి మా ప్రాణాలు తీసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లేసిన పాపానికి అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మా కంపెనీ ఏర్పాటును వెంటనే రద్దు చేయాలని, లేదంటే ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రమాదకర పరిశ్రమల కోసం ఒక్క సెంటు భూమి కూడా ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. అనంతరం దుద్యాల్ తహసీల్దార్ వెంకటేశ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో బీఆర్‌ఎస్ మండల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఫార్మా బాధిత రైతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను అడ్డుకున్న పోలీసులు

మహా పాదయాత్రలో పాల్గొనేందుకు వెళ్తున్న పలు గ్రామాల రైతులను లగచెర్ల శివారులో పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాట్లు చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మహిళా రైతులు రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

భారీగా మోహరించిన బలగాలు

బీఆర్‌ఎస్ నేతలు, ఫార్మా భూ బాధితులు చేపట్టిన మహా పాదయాత్రను అడ్డుకునేందుకు పోలీసులు భారీగా మోహరించారు. దాదాపు 500మంది పోలీసులు పాల్గొన్నారు. నారాయణపేట్ ఎస్పీ యోగేశ్ గౌతమ్, పరిగి డీఎస్పీ కరుణసాగర్, నారాయణపేట్ డీసీఆర్‌పీ నర్సింలు, డీఎస్పీ లింగయ్యతోపాటు ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్ఐలు, ప్రత్యేక బలగాలు, కానిస్టేబుళ్లు మోహరించారు. ఆందోళనకారులతో ఎస్పీ మాట్లాడారు. ధర్నా వార్త కవరేజ్ చేయడానికి ఐడీ కార్డులు ఉన్న జర్నలిస్టులను మాత్రమే అనుమతించారు. హకీంపటే వద్ద బీఆర్‌ఎస్ నాయకులు పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ యూత్ ప్రెసిడెంట్ సురేశ్‌ను పోలీసులు మెడ పట్టుకొని గట్టిగా లాగడంతో ఆయన స్పృహ కోల్పోయారు. దీంతో ఆయన్ను వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మా ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారని ఓట్లేస్తే మా నోట్లో విషం కొడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటును ఉపసంహరించుకొని తమకు న్యాయం చేయాలని రైతులు వేడుకున్నారు.

గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: గౌడ కులస్తుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సల్లా గార్డెన్‌లో కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు మేఘనాథ్‌గౌడ్ అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గౌడ కులస్తులకు కులవృత్తే జీవనాధారమన్నారు. కల్లుగీత సంఘంలో సభ్యులుగా ఉన్న కుటుంబానికి ఏటా రెండుసార్లు వాటాధనం అందించాలని సంఘం ప్రతినిధులకు చెప్పామన్నారు. గౌడకులస్తులు ఎవరైన మరణిస్తే అంత్యక్రియలకు కల్లుగీత కార్మిక సంఘం నుంచి రూ.5వేలు వెంటనే అందించాలన్నారు. త్వరలోనే సంఘం ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. అనంతరం కల్లుగీత కార్మిక కుటుంబాలకు వాటాధనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాల, నాయకులు అబ్దుల్‌రవూఫ్, శ్రీనివాస్, సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శాంతయ్యగౌడ్, కృష్ణయ్యగౌడ్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యులకు వాటాధనం అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రైతులు వద్దంటున్నా వినరా?

ప్రభుత్వ నిర్ణయంపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్

పరిగి: దుద్యాల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటుపై రైతులకు అనేక అనుమానాలు ఉన్నాయని, వారికి ఇష్టం లేకుండా పరిశ్రమ ఏర్పాటు చేయడం ఏమిటని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పరిగి పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. హకీంపేటలో ఫార్మాసిటీ ఏర్పాటును రైతులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రజలే వద్దంటున్నప్పుడు పరిశ్రమ ఏర్పాటు చేయడం సరికాదని హితవు పలికారు. జిల్లాలో కాలుష్యం లేని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని అన్నారు. రైతులకు ఇప్పుడిప్పుడే మంచి రోజులు వస్తున్నాయని, ఇలాంటి సమయంలో బలవంతంగా భూములు లాక్కుంటే రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే ముందుకు సాగాలని ప్రభుత్వానికి సూచించారు. అన్నదాతలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.



పరిగి పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

క్లుప్తంగా

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

కొడంగల్: అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి ప్రాణం పోవడానికి కారణమైన డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ కొడంగల్ సముదాయ కోర్టు న్యాయమూర్తి శ్రీరాం తీర్పు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌ఐ సత్యనారాయణ బుధవారం విలేకరులకు వెల్లడించారు. మండల పరిధిలోని పర్సాపూర్‌కు చెందిన మోహన్ అనే వ్యక్తి ఏడేళ్ల క్రితం తన కుటుంబ సభ్యులతో కలిసి ఏపీ 28 ఏసీ 8388 నంబర్ గల జీపులో తాండూరు వెళ్తున్నాడు. ఈ సమయంలో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన డ్రైవర్ పర్సాపూర్ శివారులో రోడ్డు పక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మోహన్ ప్రాణాలు విడిచాడు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదైంది. కేసును పరిశీలించిన న్యాయమూర్తి నిర్లక్ష్యంగా వాహనం నడిపి, వ్యక్తి ప్రాణాలు పోయేందుకు కారణమైన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఆలంపల్లిలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు చేశాయి. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.8180 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాయాదుల దాడి.. వ్యక్తికి గాయాలు



హన్మంత్‌రెడ్డిని ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

కుల్కచర్ల: పొలం విషయంలో చోటు చేసుకున్న ఘర్షణలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి పొలంలో వేరుశనగ వేస్తున్న క్రమంలో పక్కపొలానికి చెందిన దాయాదులు చిన్నారెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మమ్మలు కర్రలతో దాడి చేశారు. వీరికి మద్దతుగా వచ్చిన తిరుపతిరెడ్డి బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితుడు హన్మంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గాయాలపాలైన బాధితుడిని పరిగి ఆస్పత్రికి తరలించి నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి

ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జ్ఞానేశ్వర్

మొయినాబాద్‌రూరల్: ప్రజలు భక్తి భావాన్ని పెంపొందిచుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి ప్రాణం కాపాడిన 108 సిబ్బంది

మీర్‌పేట: అర్ధరాత్రి రోడ్డుపై కుప్పకూలిన ఆటో డ్రైవర్‌కు సీపీఆర్ చేసి ప్రాణం కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈసీఐఎల్‌కు చెందిన ట్రాలీఆటో డ్రైవర్ శ్రీను (26) మంగళవారం మల్లాపూర్‌లోని బంధువుల ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత 1.40 గంటలకు మందమల్లమ్మ నుంచి బాలాపూర్ చౌరస్తా వైపు ఆటోలో వెళ్తుండగా డివైడర్ పక్కన ఆటోను ఆపి రోడ్డుపైనే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా, ఐదు నిమిషాల్లో అక్కడికి చేరుకున్న సిబ్బంది.. పల్స్ తక్కువగా ఉన్నట్లు గమనించారు. ఈఆర్‌సీపీ డాక్టర్ కేశిరెడ్డి సూచన మేరకు ఈఎంటీ ఏనుగు మహేశ్ అతనికి సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడాడు. అనంతరం మీర్‌పేట పోలీసుల సాయంతో శ్రీనును ఆస్పత్రికి తరలించారు. 108 అంబులెన్స్ పైలెట్ నర్సింహులు, ఈఎంటీ మహేశ్‌కు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కల నెరవేరిన వేళ

- కొత్త టీచర్లకు నియామకపత్రాలు
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు

డీఎస్సీలో సత్తాచాటిన అభ్యర్థులు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా నియామకపత్రాలు అందుకున్నారు. పండుగ వేళ ఉద్యోగాలు పొందిన వీరిని మిత్రులు, గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ.. తమ కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు.

తాండూరు టౌన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో తాండూరు ప్రాంతానికి చెందిన పలువురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. చెంగోల్ గ్రామానికి చెందిన అశోక్, ఎల్మకన్నెకు చెందిన భువనేశ్వర్‌రెడ్డి ఎస్జీటీలుగా, కొత్లాపూర్‌కు చెందిన మహేందర్‌గౌడ్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఎస్జీటీగా, పట్టణంలోని గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన నర్సింలు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. వీరంతా సీఎం చేతులమీదుగా ఆర్డర్లు అందుకున్నారు.

కొడంగల్‌లో 89 మందికి ఉద్యోగాలు

కొడంగల్: నియోజకవర్గంలోని కొడంగల్, దుద్యాల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో కొత్తగా 89 మందికి ఉపాధ్యాయులుగా ఉద్యోగం వచ్చినట్లు ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు. వీరు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారని స్పష్టంచేశారు. శిక్షణ అనంతరం వీరికి పోస్టింగ్‌లు కేటాయించే అవకాశం ఉందన్నారు.

సంస్కృత ఉపాధ్యాయుడిగా శ్రీశైలం

తాండూరు రూరల్: మల్కాపూర్ గ్రామానికి చెందిన దొమ శ్రీశైలం సంస్కృత ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం వికారాబాద్ జిల్లాకు మాత్రమే ఉన్న సంస్కృత ఉపాధ్యాయ పోస్టును మల్కాపూర్‌వాసి దక్కించుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

చెంగోల్ నుంచి నలుగురికి..

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నా రు. వీరిలో మాల విజయలక్ష్మి, (స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్), చెన్నారం అశోక్, గౌడి మూనిక, గౌడి సుప్రియకు (ఎస్జీటీ) ఉద్యోగాలు వచ్చాయి.



శ్రీశైలం



జ్యోతి



బాలకృష్ణ



అశోక్, ఎస్జీటీ



భువనేశ్వర్ రెడ్డి, ఎస్జీటీ



మహేందర్‌గౌడ్, ఎస్జీటీ



నర్సింలు, ఎస్‌ఏ ఇంగ్లిష్



అనంతగిరి: తండ్రితో నిఖత్ ఉన్నీసా, షహీన్ ఉన్నీసా

సత్తాచాటిన అక్కాచెల్లెళ్లు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఎల్‌ఐజీ కాలనికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు తొలి ప్రయత్నంలోనే టీచర్ ఉద్యోగం సాధించారు. హైదరాబాద్‌లో బుధవారం నియామక పత్రాలు అందుకున్నారు. పట్టణానికి చెందిన మహ్మద్ సాబేర్ ప్రైవేటు ఉద్యోగి. ఇతని ఇద్దరు కూతుళ్లు నిఖత్ ఉన్నీసా, షహీన్ ఉన్నీసా డైట్ పూర్తి చేసి, డీఎస్సీ రాశారు. ప్రణాళికతో చదివి ఉద్యోగాలు సాధించారు. దీంతో వారి ఇంట్లో సంతోషం వెల్లివిరిసింది.

దంపతులకు టీచర్ కొలువులు

ధారూరు: ధారూరు పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కావలి జ్యోతి, ఆమె భర్త బాలకృష్ణకు టీచర్ కొలువులు వరించాయి. ధారూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కావలి అంజయ్య కూతురు జ్యోతి కానిస్టేబుల్‌గా పనిచేస్తూ డీఎస్సీ పరీక్ష రాసింది. ఈమెతో పాటు భర్త బాలకృష్ణ కూడా పరీక్ష రాశారు. జ్యోతి జిల్లా స్థాయిలో 7వ ర్యాంక్ సాధించగా బాలకృష్ణకు 46వ ర్యాంక్ వచ్చింది. దీంతో ఇద్దరూ ఎస్జీటీ పోస్టులు దక్కించుకున్నారు. దంపతులకు ఒకేసారి టీచర్ ఉద్యోగాలు రావడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గ్రామంలో దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతుల కథం ప్రకారం.. గ్రామ శివారులోని అమృత్‌రెడ్డి పొలంలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీని ద్వారా బోరు మోటారుకు కనెక్షన్ ఇచ్చారు. రైతులు రవికుమార్, చెన్నప్ప, రాములు, మొగులప్ప, అనంతప్ప సాగు చేసిన ఉల్లి పంటకు నీరు అందుతోంది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించి కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ శాఖ అధికారులకు కూడా సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం ఉల్లి పంట నాట్లు వేస్తున్నామని, విద్యుత్ సౌకర్యం లేకపోతే నారు ఎండిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

సీసీఐ ఆధునీకరణకు వినతి

- ఎమ్మెల్యేను కలిసిన ఫ్యాక్టరీ ఉద్యోగులు
- నూతన టెక్నాలజీని అందుబాటులోకి తేవాలని అభ్యర్థన

తాండూరు రూరల్: కరన్‌కోట్ సమీపంలోని సీసీఐ ఫ్యాక్టరీని ఆధునీకరించాలని కంపెనీ ఉద్యోగులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం తాండూరులోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీసీఐలో 450 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉండగా వీరిలో సుమారు 350 మంది విరమణ పొందారని తెలిపారు. ప్రస్తుతం 100 మంది ఉద్యోగులతోనే ఫ్యాక్టరీని కొనసాగుతోందన్నారు. కంపెనీ ఏర్పడి 44 సంవత్సరాలు గడిచినా నూతన టెక్నాలజీని అందుబాటులోకి తేవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీసీఐ ఫ్యాక్టరీ ఉద్యోగులు

ప్రైవేట్ ఫ్యాక్టరీలకు దీటుగా కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థ (సీసీఐ)ను ఆధునీకరించాలని కోరారు. ఏటా సీసీఐ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.190 కోట్ల ఆదాయం సమకూరుతోందని గుర్తుచేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉద్యోగులు బాల్‌శంకర్, వంశీకృష్ణ, చంద్రలాల్, కిరణ్ ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి

అనంతగిరి: సైబర్ నేరాల పట్ల రిటైర్డ్ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ ఇన్‌చార్జి, డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాను అదునుగా చేసుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్న నేరగాళ్లు ఇటీవల పదవీ విరమణ పొందిన అధికారులకు టార్గెట్ చేశారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీపై రిటైర్డ్ ఎంప్లాయిస్, ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ల సహకారంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు నేరాల విషయంలో రిటైర్డ్ ఉద్యోగులు ఎలా మోసపోయారు, సైబర్ నేరగాళ్లు ఎలా బోల్తా కొట్టిస్తున్నారనే అంశాలను పలు కేసుల విషయాలను ప్రస్తావించి అవగాహన కల్పించారు. వీటి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు ఎలా చేపట్టాలి, ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు. వ్యక్తిగత విషయాలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. ముఖ్యంగా బ్యాంక్ సంబంధించి పాస్‌వర్డ్‌లు, పిన్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రశాంత్‌రెడ్డి

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొందుర్గు, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ పట్టణానికి చెందిన 76 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.19.39లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల స్థాయిని పెంచడంతో పాటు, మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, కృష్ణారెడ్డి, బస్వం తదితరులు పాల్గొన్నారు.

రూ.3.5 కోట్లతో అదనపు తరగతి గదులు

కొత్తూరు: విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలిక హాస్టల్ ఆవరణలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.3.5కోట్లతో ఎస్ఎస్ఏ నిధులతో అదనపు తరగదుల నిర్మాణాన్ని చేపడ్తున్నామన్నారు. నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ.. గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది లోపే ఉపాధ్యాయుల నియామకం చేపట్టిందన్నారు. అక్షరాస్యత శాతాన్ని పెంచడంతో పాటు గ్రామీణ స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మారుతున్న కాలానుగుణంగా పాఠశాల విద్యలో మార్పులు అవసరమన్నారు. విద్యార్థులు సైతం చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. చదువుకున్న వారికే భవిష్యత్ ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. అనంతరం స్థానిక గిరిజన నాయకులు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను తమ ప్రాంత అభివృద్ధికే కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, హరినాథ్‌రెడ్డి, సురేందర్, మహేందర్, శ్రీను, నర్సింహ, సత్తయ్య, గోవింద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలు

- అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో వెలుగులోకి..
- శవాలను ఉస్మానియా మార్చురీకి తరలించిన పోలీసులు

అబ్దుల్లాపూర్‌మెట్: వేర్వేరు చోట్ల రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ శివారులోని గండిమైసమ్మ ఆలయ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ఓ వ్యక్తి మృతదేహం ఉందనే సమాచారం మేరకు.. పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. మృతుడికి సుమారు 50– 55 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఇతనికి సంబంధించిన వివరాలేవీ తెలియరాలేదు. మృతుడు యాచకుడై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో మహిళ మృతదేహం

బాటసింగారం పరిధిలోని ఓ పౌల్ట్రీ ఫాం సమీపాన పాడుబడిన బావిలో పడి మహిళ మృతిచెందినట్లు డయల్ 100కి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలి వయస్సు 40– 45 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. ఈమె కూడా యాచకురాలై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి, రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

కాంగ్రెస్‌పై ప్రతిపక్షాల దుష్ప్రచారం

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తుంటే ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ మండల వాసులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిరుద్యోగులకు మేలు చేకూరేలా ఎప్పటిఎప్పుడు ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ కొనసాగిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాల పటిష్టకు ఫ్యామిటీ డిజిటల్ కార్డులు రూపొందిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ఆమనగల్లు మండల అధ్యక్షుడు జగన్, పార్టీ నాయకులు ఖాదర్, మెకానిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



దుర్గామాత పూజలో జైపాల్‌యాదవ్ తదితరులు

తలకొండపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని మాదాయిపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాత బుధవారం సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా జైపాల్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడిపంటలు, సుఖశాంతులతో నియోజకవర్గ ప్రజలు వర్ధిల్లేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబర్ రహ్మాన్, మాజీ సర్పంచ్ ఎల్ఎన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, మోహన్‌లాల్, వెంకటయ్య, బాలస్వామి, శ్రీను, రవి, సత్యం, మాధవులు తదితరులు పాల్గొన్నారు.

‘పట్నం’ కు శుభాకాంక్షల వెల్లువ



మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, నాయకులు

తాండూరు: రాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్‌గా పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

లారీ యజమానుల సమస్యలు పరిష్కరించండి

తాండూరు టౌన్: సిమెంట్ రవాణాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారు అడ్వకేట్ గోపాల్ స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. సిమెంట్ లారీ కిరాయి చార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ ఘని, శివకుమార్ తదితరులను కలిసి సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ.. సిమెంటు కంపెనీల యాజమాన్యాలు లోకల్ లారీలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టన్ను సిమెంటుకు రూ.750 పెంచాలని డిమాండ్ చేశారు. లోడింగ్, అన్‌లోడింగ్ చార్జీలను కంపెనీ యాజమాన్యమే భరించాలని కోరారు. ఇప్పటికే డీజిల్, స్పేర్ పార్ట్స్, ఇన్సూరెన్స్, టైర్ ట్యాక్స్ వంటివి పెరగడంతో లారీ యజమానులు ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు. ఆయా విషయాలపై సిమెంటు కంపెనీల నిర్వాహకులతో చర్చించి, యజమానులకు న్యాయం చేయాలని కోరారు.



లారీ యజమానుల సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న అసోసియేషన్ సలహాదారు, అడ్వకేట్ గోపాల్

యువత క్రీడలపై దృష్టి సారించాలి

రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్

మొయినాబాద్: గ్రామీణ ప్రాంత యువత క్రీడలపై సైతం దృష్టి సారించాలని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం మొయినాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. మండల పరిధి నుంచి 14 జట్లు తలపడగా అజీజ్‌నగర్, రెడ్డిపల్లి జట్లు ఫైనల్‌కు చేరాయి. అజీజ్‌నగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలవడంతో రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రెడ్డిపల్లి జట్టుకు రూ.పది వేలు, తృతీయ స్థానంలో నిలిచిన చందానగర్ జట్టుకు రూ.5వేలు, కనకమామిడి జట్టుకు ప్రోత్సాహక బహుమతిగా రూ.2,500 నగదు బహుమతితో పాలుగా షీల్డులు అందజేశారు. బహుమతులు అందజేసిన అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ ముజాఫర్ అలీ, కేజీరెడ్డి కళాశాల ఏఓ రవికిరణ్‌రెడ్డి, కానిస్టేబుల్స్ నర్సింహ, మహేశ్వర్‌రెడ్డి, బద్రి, ఈర్షత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్

మడిగెలకు మోక్షమెప్పుడో?

కోట్లు వెచ్చించి నిర్మించిన మడిగెలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇంజనీరింగ్ విభాగం నిర్లక్ష్యం కారణంగా కొన్ని పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో మార్కెట్ ఆదాయానికి గండిపడుతోంది.

- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- నిర్మాణం పూర్తైనా నిరుపయోగంగానే
- మార్కెట్ ఆదాయానికి గండి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్‌లో 2022లో రూ.1.25కోట్లతో 17 మడిగలు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. విద్యుత్ తదితర పనులు పెండింగ్‌లో ఉండడంతో ఇంజనీరింగ్ విభాగం అదికారులు ఈ మడిగెలను మార్కెట్ శాఖకు అప్పగించలేదు. మార్కెట్ ఆధీనంలోకి తీసుకుంటే ప్రతీ నెల సుమారు రూ.4లక్షల వరకు కొత్త మార్కెట్ ఖాతాలో జమయ్యే అవకాశం ఉంది.

టెండర్ల కోసం ఎదురుచూపులు

గతంలో రెండు దఫాలుగా ఈ మార్కెట్ యార్డులో నిర్మించిన 53 మడిగెలకు అప్పటి వేలం ప్రక్రియ ప్రకారం ప్రతీ నెల రూ.5 లక్షల వరకు అద్దె రూపంలో ఆదాయం వస్తుండేది. కొత్త మడిగెలకు టెండర్లు ఆహ్వానిస్తే ఒక్కో మడిగె రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ప్రతీ అద్దె రూపంలో వచ్చే అవకాశం ఉంది. ఆదాయం వచ్చే మార్గం ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మడిగెలు నిరుపయోగంగా మారాయి. ఈ టెండర్లు ఎప్పుడు ఆహ్వానిస్తారోనని పలువురు వ్యాపారస్తులు ఎదురు చూస్తున్నారు. మార్కెట్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేసి మడిగెలను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో అలంకార ప్రాయంగా ఉన్న మడిగెలు

త్వరలో ప్రారంభిస్తాం



మార్కెట్ యార్డులో మడిగెల నిర్మాణాన్ని చేపట్టాం. నిర్మాణాలు పూర్తైనప్పటికీ మరి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఈ మడిగెలను తమకు అప్పగించిన వెంటనే ఆన్‌లైన్‌లో టెండర్ల ప్రక్రియను చేపడతాం. విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు ఇప్పటికే డబ్బురూపంలో డీడీ కట్టాం. రోడ్డు మధ్యలో మడిగెల ఎదుట ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్లును మార్పిస్తాం.

– సంతోష్‌కుమార్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ యార్డు, ఇబ్రహీంపట్నం